www.prajapakasham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 01 | నవంబర్ | 2025 పేజీలు : 8

## సిపిఐకి రూ.లక్ష విరాళం అందించిన క్రైస్తవ సోదరులు



3 లో

# సిపిఎం నాయకుడు రామారావు దారుణ హత్య







**-సిపిఎం, సిపిఐ నేతలు సహా పలువురి నివాళి**
**-సంచలనంగా మారిన రామారావు హత్య**



**ప్రజాపక్షం/ ఖమ్మం /చింతకాని :** సిపిఎం సీనియర్ నాయకులు, రైతు సంఘం ఉమ్మడి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సామినేని రామారావు (75)ను శుక్రవారం ఉదయం ప్రత్యర్థులు దారుణంగా హత్య చేశారు. ఆయన స్వగ్రామం చింతకాని మండలం పాతర్లపాడులో ఉదయం ఐదు గంటలకు లేచి ఉదయపు నడక అనంతరం ఇంటికి చేరుకున్న రామారావు పక్కనే ఉన్న చావిడిలో పని చేస్తుండగా అప్పటికే అక్కడ మాటు వేసిన దుండగులు ఒక్కసారిగా రామారావుపై పడి కత్తితో పొట్ట, ఛాతీ భాగంలో పొడిచారు. తీవ్ర కత్తి పోట్లతో రక్తస్రావం కావడంతో రామారావు సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. రామారావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రామారావు హత్య ఈ ప్రాంతంలో సంచలనం సృష్టించింది. మృతి వార్త తెలిసిన వెంటనే ఖమ్మం సిపి సునీల్ దత్ సంఘటన స్థలంకు చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్‌టీంను, ఫోరెన్సిక్ బృందాన్ని రంగంలోకి దించారు. ఈ బృందాలు రక్త నమూనాలు, వేలిముద్రలు సేకరించగా డాగ్ స్క్వాడ్‌ను సైతం రంగంలోకి దించారు. రామారావు శరీరంపై ఏడు కత్తి గాట్లు ఉన్నాయి. రామారావు

మిగతా 2లో..

## పంట నష్టంపై సర్వే చేపట్టి
# నివేదికలు అందించండి



**- ఎంఎల్‌ఏ కూనంనేని**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, వరదలతో వేలాది ఎకరాలు పంటలు దెబ్బతిని రైతులు నష్టాల్లో కూరుకుపోయారని,పంటలు నష్టపోయి దిక్కు తోచని స్థితిలో ఉన్నరైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. సుజాతనగర్ మండల పరిధిలోని పలుగ్రామలాల్లో శుక్రవారం ఆయన పర్యటించి క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. జరిగిన నష్టంపై రైతులతో ముచ్చటించారు. అనంతరం

మిగతా 2లో..

## అంచనాలు కాదు.. పరిహారమివ్వండి



**-రైతులను తీవ్రంగా నష్టపరిచిన అతివృష్టి**
**-రైతు సంఘం సమావేశంలో బాగం**

3 లో

## పోరాటాలతోనే హక్కుల సాధన

**-హక్కులను హరించివేస్తున్న మోడీ సర్కార్**
**-ఘనంగా ఏఐటియుసి ఆవిర్భావ దినోత్సవం**

2లో..



# సిపిఎం నాయకుడు రామారావు దారుణ హత్య

(మొదటిపేజీ తరువాయి)
సుదీర్ఘకాలం పాతర్లపాడు గ్రామ సర్పంచ్‌గా పని చేశారు. సౌమ్యుడిగా పేరున్న రామారావు హత్య ఈ ప్రాంతంలో ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసులు గ్రామంలో పికెట్ ఏర్పాటు చేశారు. లా అండ్ ఆర్డర్ అడిషనల్ డిసిపి ఆర్. ప్రసాదరావు, వైరా, మధిర సబ్ డివిజన్ పోలీసులు గ్రామంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

**సిపిఎం నేతల నివాళి...**

రామారావు మృతిపట్ల సిపిఎం, జిల్లా రాష్ట్ర కమిటీలు తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశాయి. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, రాష్ట్ర నాయకులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఎం నాయకులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు, వై. విక్రం, మడుపల్లి గోపాలరావు తదితరులు అరుణ పతాకాన్ని ఉంచి నివాళులర్పించారు.

**సిపిఐ నేతల నివాళి...**

రామారావు మృతిపట్ల సిపిఐ తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సిపిఎం కార్యాలయంలో రామారావు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ రామారావు హత్యను సిపిఐ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. హత్య కారకులను కనుగొని కఠినంగా శిక్షించాలన్నారు. హత్యా రాజకీయాలతో ఎవరు మనుగడ సాగించలేరని ఆయన స్పష్టం చేశారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు, శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ సీతామహాలక్ష్మి, పావులూరి మల్లికార్జున్, చింతకాని మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, వివిధ సంఘాల నాయకులు ఇటికాల రామకృష్ణ, తాటి నిర్మల, ఆళ్ల రవీందర్, తాళ్లూరి యాదగిరి, కొత్తపల్లి రమేష్, చింతల రమేష్, శివ తదితరులు ఉన్నారు.

# పోరాటాలతోనే హక్కుల సాధన

**ప్రజాపక్షం/ ఖమ్మం :** పోరాటాలతోనే హక్కులు సాధించబడతాయని ప్రస్తుతం కార్మికులు అనుభవిస్తున్న హక్కులు, సంక్షేమ పథకాలు ఏఐటియుసి పోరాట ఫలితమేనని ఏఐటియుసి జాతీయ సమితి సభ్యులు బిజి క్లెమెంట్ తెలిపారు. అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న హక్కులకు మోడీ సర్కార్ తూట్లు పోడుస్తుందని, హక్కులను హరించివేస్తుందని ఆయన ఆరోపించారు. ఏఐటియుసి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఖమ్మం నగరంలోని పర్ణశాల వద్ద గల ఏఐటియుసి పైలాన్ వద్ద ఏఐటియుసి పతాకాన్ని ఆవిష్కరించారు. నగరంలోని పలు కార్మిక వాడల్లో, పారిశ్రామిక ప్రాంతాల్లో ఏఐటియుసి పతాకాలను ఆవిష్కరించారు. ఏఐటియుసి పైలాన్ వద్ద జరిగిన సభలో క్లెమెంట్ మాట్లాడుతూ 105 సంవత్సరాల సుదీర్ఘ చరిత్రలో కార్మికుల పక్షాన నికరంగా పోరాడి హక్కులు సాధించింది ఏఐటియుసి మాత్రమేనన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే భారతదేశంలో ఏర్పడిన తొలి ట్రేడ్ యూనియన్ ఏఐటియుసి అని క్లెమెంట్ తెలిపారు. బ్రిటిష్ పాలనలోనే పోరాడి ట్రేడ్ యూనియన్ చట్టాన్ని తీసుకు వచ్చిందని స్వాతంత్ర్య అనంతరం ప్రజా ప్రయోజన చట్టం పిఎఫ్ చట్టం, కార్మికులకు బోనస్ సాధించింది ఏఐటియుసి అన్నారు. ప్రస్తుతం శ్రమ దోపిడీ పెరిగిందని, ఉద్యోగ భద్రత, పని భద్రత కరువవుతుందన్నారు. కార్పొరేటీకరణ ఫలితంగా దేశంలో నిరుద్యోగం పెరిగిపోతుందని ఆయన ఆరోపించారు. మోడీ పాలన ఇదే రీతిలో కొనసాగితే కార్మికులు హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కార్మిక చట్టాలు మార్పు చేసి లేబర్ కోడ్‌ల పేరుతో మోడీ నయా నియంతృత్వాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని క్లెమెంట్ ఆరోపించారు. సంఘటిత ఐక్య పోరాటాలే హక్కులను కాపాడతాయని ఆయన స్పష్టం చేశారు. ఏఐటియుసి ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పోరాటాలకు సంసిద్ధులు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

**గురుదాస్ దాస్ గుప్తాకు నివాళి...**

ఏఐటియుసి అగ్రనాయకుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు గురుదాస్ దాస్ గుప్తా ఐదవ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పైలాన్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ భారతదేశ కార్మిక రంగానికి దాస్ గుప్తా చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాదె లక్ష్మి నారాయణ, తోట రామాంజనేయులు, జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ సీతామహాలక్ష్మి, జిల్లా నాయకులు పేరబోయిన మోహన్‌రావు, పిట్టల మల్లయ్య, ఎండి జాకీరుద్దీన్, గుండెపొంగు మల్లేష్, తాటి నిర్మల, జి. నర్సయ్య, కోటేశ్వరరావు, రావుల శ్రీను, గురవయ్య, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

# రామారావును హత్య చేసింది కాంగ్రెస్సే : పోతినేని



**ప్రజాపక్షం/ ఖమ్మం :** సిపిఎం రాష్ట్ర నాయకులు సామినేని రామారావును కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే దారుణంగా హత్య చేశారని సిపిఎం జిల్లా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు ఆరోపించారు. ఇటీవల గ్రామంలో జరిగిన ఒక స్వల్ప ఘటనను సాకుగా తీసుకుని రామారావును దారుణంగా హత్య చేశారని ఆయన తెలిపారు. పాతర్లపాడు గ్రామంలో సిపిఎం బలంగా ఉందని సిపిఎంను స్థానిక సంస్థల్లో ఎదుర్కొవడం కష్టమని భావించిన కాంగ్రెస్ నేతలు పథకం ప్రకారం హత్య చేశారని ఆయన తెలిపారు. ఈ హత్య వెనుక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క హస్తం ఉందని ఆయన ఆరోపించారు. గతంలో బోనకల్ మండలం గోవిందాపురం ఎల్ గ్రామంలో సిపిఎం కార్యకర్తను కాంగ్రెస్ కార్యకర్తలు దారుణంగా హత్య చేశారని తిరిగి ఇప్పుడు సిపిఎం నాయకున్ని హత్య చేయడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ నాయకులకు తెలియకుండా ఈ హత్య జరగదని ఆయన తెలిపారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు సహకరించాలని ఆయన కోరారు. పోలీసులు అధికారానికి తలొగ్గకుండా హత్యకు కారకులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని సుదర్శన్‌రావు డిమాండ్ చేశారు.

**-హత్య చేయాల్సిన అవసరం లేదు : కాంగ్రెస్**



**హత్య చేయాల్సిన అవసరం లేదు : కాంగ్రెస్**

సామినేని రామారావును హత్య చేయాల్సిన అవసరం కాంగ్రెస్ పార్టీకి లేదని కాంగ్రెస్ పార్టీ ఏనాడు హత్యా రాజకీయాలను ప్రోత్సహించదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాతర్లపాడుకు చెందిన సామినేని రామారావు హత్యను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కాంగ్రెస్ నాయకులే హత్య చేసినట్లు ఇందులో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రమేయం ఉన్నట్లు సిపిఎం ఆరోపించడం తగదన్నారు. నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణాన్ని కాపాడేది కాంగ్రెస్ పార్టీ అన్న విషయాన్ని సిపిఎం గుర్తుంచుకోవాలన్నారు. హత్య రాజకీయాలకు పాల్పడేది గతంలో తెల్దారుపల్లి, గోకినేపల్లిలో హత్యలు చేసింది ఎవరో జిల్లా ప్రజలకు తెలుసన్నారు. రామారావు హత్యపై సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంఎల్‌సి పోట్ల నాగేశ్వరరావు, నాయకులు దొబ్బల సౌజన్య, హుస్సేన్, వీరభద్రం, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పంట నష్టంపై సర్వే చేపట్టి
# నివేదికలు అందించండి

(మొదటిపేజీ తరువాయి)
కూనంనేని మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదల కారణంగా జరిగిన పంటల నష్టంపై యుద్ధ ప్రాతిపదికన సర్వే చేపట్టి పూర్తి చేయాలని ప్రభుత్వానికి నివేదికలు ఇవ్వాలన్నారు. జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిహారం కోసం కృషి చేస్తానని చెప్పారు. అప్పులు చేసి సాగు చేసిన రైతులకు తగిన ప్రతిఫలం దక్కకుండా ఆర్థికంగా దెబ్బతిన్నారని, రైతాంగ నష్టంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలుస్పందించి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, విద్యుత్ పునరుద్ధరణ పనులు తక్షణమే పూర్తి చేయాలని, ఇండ్లు కోల్పోయిన నిరాశ్రయులైన పేదలకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, తహశీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపిడిఓ భారతి,వ్యవసాయాధికారిణి నర్మద, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, వీర హనుమంతరావు, సిపిఐ నాయకులు సలిగంటి శ్రీనివాస్, భూక్యా ధ్రస్తు, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు తదితరులు పాల్గొన్నారు.

# సామినేని హత్యను ఖండించిన వివిధ పార్టీల నేతలు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** సిపిఎం నేత సామినేని రామారావు హత్యను వివిధ రాజకీయ పార్టీల నేతలు, పలువురు ప్రజాప్రతినిధులు తీవ్రంగా ఖండించారు. మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు రామారావు హత్యను తీవ్రంగా ఖండించారు. హత్యా రాజకీయాలు మానుకోవడం మంచిదన్నారు. రైతు సంఘం నాయకునిగా, మాజీ సర్పంచ్‌గా చిరపరిచితుడైన రామారావును హత్య చేయడం దిగ్భ్రాంతిని కలిగించిందని ఆయన తెలిపారు. దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. మాజీ శాసన సభ్యురాలు బానోత్ చంద్రావతి రామారావును హత్యను ఖండించారు. ఆమె రామారావు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రైతు సంఘం నేత నల్లమల వెంకటేశ్వర్లు రామారావు హత్యను ఖండించారు. జిల్లా వ్యాప్తంగా రామారావు హత్యను ఖండిస్తూ వివిధ వర్గాల ప్రముఖులు, రాజకీయ నేతలు ప్రకటన విడుదల చేశారు.

# అన్ని కోణాల్లో దర్యాప్తు
**-సిపి సునీల్ దత్**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** చింతకాని మండలం పాతర్లపాడు గ్రామంలో హత్యకు గురైన సిపిఎం నాయకుడు సామినేని రామారావు కేసులో అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని ఖమ్మం సిపి సునీల్ దత్ తెలిపారు. శుక్రవారం హత్యా వార్త తెలిసిన వెంటనే ఆయన సంఘటన స్థలంకు చేరుకున్నారు. స్థానిక పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. క్లూస్‌టీమ్‌లు, డాగ్ స్క్వాడ్‌లను రంగంలోకి దించారు. ఫోరెన్సిక్ నిపుణులతో పాటు బహుముఖ దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ రామారావు హత్య కేసు విషయంలో అనవసర పుకార్లు చేయవద్దని అతి త్వరలోనే నిందితులను పట్టుకుంటామన్నారు. దోషులు ఎవరైనా వదిలేది లేదని ప్రశాంత వాతావరణానికి సహకరించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# హింసా రాజకీయాలకు తావు లేదు
**-రామారావు హత్యను ఖండించిన ఉప ముఖ్యమంత్రి భట్టి**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** సమాజంలో హింసా రాజకీయాలకు తావు లేదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. సిపిఎం సీనియర్ నాయకులు సామినేని రామారావు హత్యను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క ఒక ప్రకటన విడుదల చేశారు. రామారావు హత్య దిగ్భ్రాంతిని కలిగించిందని దోషులు ఎంతటి వారైనా వెంటాడి వేటాడి చట్ట పరంగా శిక్షిస్తామని ఆయన తెలిపారు. హత్య జరిగిన వెంటనే శాంతిభద్రతలపై ఉప ముఖ్యమంత్రి పోలీస్ అధికారులతో మాట్లాడారు. అధునీక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దోషులను వెంటనే అరెస్టు చేయాలని ఆయన పోలీస్ అధికారులను ఆదేశించారు., రామారావు కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు విక్రమార్క తెలిపారు.

# విద్యార్థులకు కెరియర్ గైడెన్స్‌పై అవగాహన




**ప్రజాపక్షం/మణుగూరుః** ఐటీడీఏ భద్రాచలం ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆదేశానుసారం ఏజెన్సీ ప్రాంతంలోనీ విద్యార్థినీ విద్యార్థులకు భవిష్యత్తులో ముందడుగు వేయడానికి కెరియర్ గైడెన్స్ అనే ఒక ప్రోగ్రాంని తీసుకు రావడం జరిగింది. అందులో భాగంగా ప్రతి నెలలో 2వ శుక్రవారం, 4వ శుక్రవారం నిర్వహించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ బి.రాహుల్ తీసుకురావడం జరిగింది. అందులో భాగంగా శుక్రవారం మణుగూరు పట్టణంలోని సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగబాబుని ఆహ్వానించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న విషయాల గురించి ప్రస్తావిస్తూ ఆయన జీవితంలో ఉన్నత స్థాయికి ఎలా ఎదిగారు అనే దాని గురించి వివరించారు. కెరియర్ గైడెన్స్ ప్రోగ్రాంలో భాగంగా పదో తరగతి పూర్తయిన తర్వాత ఏ ఏ కోర్సులు తీసుకొని ఎలా ముందుకు వెళితే జాబులు సంపాదించుకోవచ్చు ప్రస్తుత సమాజంలో ఏ కోర్సులు బాగా డిమాండ్ ఉన్నాయి, వాటి గురించి అవగాహన కల్పిస్తూ జాబ్ సాధించడానికి మెళకువలు చెబుతూ వారి జీవితంలో జరిగిన విషయాలను ఉదాహరణలుగా చెబుతూ ఎలా ముందుకు వెళ్లాలని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మహాలక్ష్మి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ప్రాజెక్ట్ ఆఫీసర్ బి.రాహుల్ సార్ పెట్టడం ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగబాబుని ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మహాలక్ష్మి, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు రాణి, వీరభద్రం, మిగిలిన ఉపాధ్యాయులు సుబ్బలక్ష్మి, రాజ్యలక్ష్మి సుగుణ, వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అంచనాలు కాదు.. పరిహారమివ్వండి

**-రైతులను తీవ్రంగా నష్టపరిచిన అతివృష్టి**
**-రైతు సంఘం సమావేశంలో బాగం**



**ప్రజాపక్షం/ఖమ్మం :** రైతాంగం దెబ్బతిన్న ప్రతిసారి పంటల నష్టపరిహారం అంచనా వేయడం వరకే పరిమితమవుతున్నారని పరిహారం పరిహాసంగా మారుతుందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు ఆరోపించారు. ప్రకృతి విపత్తు ఏర్పడిన ప్రతిసారి పాలకులు పంటల అంచనాలంటూ ప్రకటనలకే పరిమితమవుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం ఖమ్మంలో శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ అధ్యక్షత వహించగా సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హేమంతరావు మాట్లాడుతూ ఈ ఏడాది అతివృష్టి రైతులను తీవ్రంగా నష్టపరిచిందన్నారు. మొన్నటి వరకు అతివృష్టి కారణంగా మెట్ట పంటలైన పత్తి, అపరాలు, ఉద్యానవన పంటలు దెబ్బతినగా మొంథా తుఫాన్ కారణంగా వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఎకరాకు రూ. 30వేల పైబడి పెట్టుబడులు పెట్టారని తీరా కోతకు వచ్చే సమయంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి పూర్తిగా నేలవాలిందన్నారు. భారీ వర్షాల కారణంగా నదులు, వాగుల పరివాహక ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నాయని ఆయన తెలిపారు. పెట్టుబడులు పెరిగి దిగుబడులు తరిగి రైతులు నష్టపోతున్నారని ప్రకృతి సైతం రైతులపై పగబట్టినట్లుగా ఉందని హేమంతరావు తెలిపారు. ప్రకృతి విపత్తులు సంభవించగానే నష్టం అంచనాలను వేస్తున్నామంటూ పాలకులు ప్రకటనలను జారీ చేస్తున్నారని కాని పరిహారం మాత్రం అందించడం లేదన్నారు. గడిచిన రెండేళ్లలో పలుమార్లు ప్రకృతి విపత్తులు సంభవించాయని ఆయన తెలిపారు. ఈ ఏడాది పత్తి రైతులను ఆదుకోవాలనే డిమాండ్ డిమాండ్‌గానే మిగిలిందని ఇప్పుడు వరి రైతులకు ఆ పరిస్థితి తీసుకు రాకుండా వెంటనే పరిహారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు జాగర్లమూడి రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐకి లక్ష రూపాయలు విరాళం అందించిన క్రైస్తవ సోదరులు



**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది సంబరాల ముగింపు సందర్భంగా జరిగే భారీ బహిరంగ సభ ప్రదర్శనకు సంబంధించి క్రైస్తవ ప్రముఖులు లక్ష రూపాయల విరాళాన్ని అందించారు. శుక్రవారం సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావుకు ఈ మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హేమంతరావు వారికి సిపిఐ ప్రజా ఉద్యమాలకు మద్దతుగా నిలిచినందుకు ధన్యవాదాలు తెలిపారు. సిపిఐ సెక్యులరిజం పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం పోరాడుతుందన్నారు. క్రిస్టియన్ ప్రముఖులు మాట్లాడుతూ సిపిఐ ప్రజా ఉద్యమాలను స్వాగతిస్తున్నామని నాయకత్వ స్థాయిలో సిపిఐ చేపట్టిన సామాజిక న్యాయానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. భవిష్యత్తులో సైతం ఇదే రీతి ఆదరణ కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, కార్పొరేటర్ బిజి క్లెమెంట్, క్రిస్టియన్ ప్రముఖులు శేఖర్‌బాబు, విజయ్‌పాల్, కంటెపూడి జాన్సన్, జెట్టి సుధాకర్, జాసన్, సంజీవరావు, మార్టిన్, జొన్నలగడ్డ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కుల సాధనలో ఎఐటియుసి కృషి మరువలేనిది



**ప్రజాపక్షం/ మధిర :** దేశంలో, రాష్ట్రంలో కార్మికులు, ఉద్యోగులు అనుభవించే ప్రతి హక్కు ఎఐటీయూసి కృషి, పోరాట ఫలితమేనని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ఎ.రహీం అన్నారు. శుక్రవారం సిపిఐ అనుబంధ సంఘం ఎఐటియూసి 106వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మధిరలో ఘనంగా జరిగాయి. ఎఐటియూసి దినోత్సవాన్ని పురస్కరించుకుని మధిర పట్టణంలోని ఆర్‌వి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ఎఐటీయూసి జెండాని ఆవిష్కరించారు. అనంతరం ఆ సంఘం మధిర డివిజన్ కార్యదర్శి చెరుకూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎంఎ రహీం మాట్లాడుతూ పని భద్రత, కనీస వేతనాలు అమలు చేయడం పాలకులు, యజమానుల బాధ్యత అని, ఈ బాధ్యతను విస్మరించి పాలనా సాగిస్తున్నారని అన్నారు. కార్మిక వర్గం ఎన్నో పోరాటాలు, ప్రాణత్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర సర్కార్ నాలుగు కోడులను విభజించి కార్మికుల సంక్షేమాన్ని యాజమాన్యాలకు, పారిశ్రామిక వేత్తలు తాకట్టు పెడుతోందని విమర్శించారు. పారిశ్రామిక వేత్తలకు కేంద్రంలోని మోడీ సర్కార్ ఊడిగం చేయడం మినహా ఈ దేశ ప్రజలకు, కార్మిక వర్గానికి చేసింది శూన్యమని అన్నారు. కార్మికులు సమిష్టి ఉద్యమాలు, పోరాటాలతో తమ హక్కులను కాపాడుకోవాలని, నూతన హక్కులను సాధించుకోవాలని, అందుకు కార్మికులను, ఉద్యోగులను చైతన్యవంతం చేసే బాధ్యత ఎఐటీయూసి నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు పెరుమాళ్ళపల్లి ప్రకాశరావు, ఎఐటీయూసి మండల కార్యదర్శి ఊట్ల రామకృష్ణ నాయకర్, ఎస్కే కొండ, యూనియన్ నేతలు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ సానుభూతిపరురాలు మృతి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని ఆరెకోడుతండా, గొల్లగూడెం శాఖలకు చెందిన సిపిఐ సానుభూతిపరురాలు నునావత్ లచ్చమ్మ (70), సుక్కయ్య(55) అనారోగ్యం తో ఇంటివద్ద శుక్రవారం మృతి చెందారు. మరణ వార్త తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలా నా ఎర్రజెండాలను కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సిపిఐ పార్టీ బలోపేతానికి వారు చేసిన కృషిని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంపటి సురేందర్, ఎడ్లపల్లి శంకరయ్య, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, నాయకులు ఉపేందర్, రామసంఘం, బానోత్ సీతారాం, గుగులోత్ హరిదాస్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ వర్ధంతి



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఉక్కు మహిళ, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 41వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మిరియాల రమణగుప్తా ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద బడుగుబలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం 20 సూత్రాల పథకాన్ని ప్రవేశపెట్టిన మహోన్నతమైన వ్యక్తి ఇందిరాగాంధీ అని అన్నారు. అన్ని బ్యాంకులను జాతీయం చేసి పేద ప్రజలకు బ్యాంకింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. వారి ఆశయాలను కొనసాగించి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తూమాటి నవీన్‌రెడ్డి, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు దుంప వెంకటేశ్వరరెడ్డి, మండల బిసి సెల్ అధ్యక్షులు చిలువేరు బుచ్చిరామయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్, బాణావత్ వెంకటరమణ నాయక్, కర్నాటి రామారావు, నిడమనూరు వంశీకృష్ణ, మువ్వ వెంకయ్య షేక్.జహంగీ, బిట్ర ఉద్దండయ్య, తలుపుల వెంకటేశ్వర్లు, మోదుగు బాబు, యన్నం కోటేశ్వరరావు, మొండితోక సధాకర్, దేవిశెట్టిరంగా తదితరులు పాల్గొన్నారు.

# పీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బూట్లు పంపిణీ



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఏదులాపురంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు పీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బూట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు మాట్లాడారు...మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చిన్నారులకు ప్రోత్సహకంగా ఉండాలనే లక్ష్యంతో అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు అంబటి సుబ్బారావు, తమ్మినేని నవీన్, మండల నాయకులు కందుకూరి వెంకటనారాయణ, ఏటుకూరి సుధాకర్, అజ్మీర అశోక్, సంగయ్య, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

# సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని జమలాపురం గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సేవా సమితి కార్యదర్శి లక్కిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం విజయవాడ పట్టణానికి చెందిన ఎం. గిరిజాలక్ష్మి, శ్రీనివాసరావు దంపతుల సహకారంతో అయ్యప్పమాలదారులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దాతలు ముందుకు వచ్చి సహకరిస్తే ప్రతిరోజూ వారి పేరు మీద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్విర్మాంగా నిర్వహిస్తామని సేవా సమితి సభ్యులు తెలిపారు. అదేవిధంగా దాతలు వెంకటేశ్వర అన్నదాత సత్రంలో ఇనుప బీరువాను బహుకరించగా, వంట చేసే మహిళలకు చీరెలు అందచేశారు. ఈ కార్యక్రమంలో స్థలదాత గౌరవాధ్యక్షులు కొడాలి విజయ, లక్ష్మీ దేవి, అధ్యక్షులు బొబ్బా కృష్ణప్రసాద్, ఉపాధ్యక్షురాలు గిరిజా లక్ష్మీ, ఉపాధ్యక్షులు ఇమ్మిడి ఈశ్వర్‌చంద్ర, విద్యాసాగర్, కార్యదర్శి ఎల్వి నారాయణరెడ్డి, సహాయ కార్యదర్శి చింతా కిషోర్, కోశాధికారి వీరమాచనేని వెంకటకృష్ణ, కాకుమాను లీలా కృష్ణ, ఆలయ మాజీ ఇఓ విష్ణుమూర్తి, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా 2కె రన్




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్ నుంచి పెద్దతండా వరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 2కే రన్ ఉత్సాహంగా సాగింది. ప్రారంభానికి ముందు కూసుమంచి ఎస్ఐ ప్రతిజ్ఞ చేపించారు. ఈ ర్యాలీలో పోలీసులతో పాటు నర్సింగ్ కళాశాల విద్యార్థులు, పౌరులు పాల్గొన్నారు. ఏసీపీ తిరుపతిరెడ్డి పోలీసులు, విద్యార్థులతో పాటు పౌరులతో ఉత్సాహంగా ఉరకలేస్తూ వారిలో జోష్ నింపారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ ముష్క రాజు, ఎస్ఐ హరికృష్ణ, కానిస్టేబుల్‌లు పాల్గొన్నారు.

## వైరాలో పోలీసుల ఆధ్వర్యంలో 2కే రన్



**ప్రజాపక్షం/వైరా:** రాష్ట్రీయ ఏక్తా దివాస్‌లో భాగంగా వైరాలో పోలీసుల ఆధ్వర్యంలో రింగు రోడ్డు నుంచి పాత బస్టాండ్ వరకు 2కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని‌న వైరా ఎస్సై పుప్పాల రామారావు, మధిర టౌన్ ఎస్సై రమేష్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. అక్కడ నుంచి ప్రారంభమైన 2కే రన్ కార్యక్రమం వైరా పాత సెంటర్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు, విద్యార్థులు, పోలీసులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ వైరా నియోజకవర్గ ఇంచార్జిగా ఆత్మకూరి శేషగిరిరావు నియామకం



**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ వైరా నియోజకవర్గ ఇంచార్జిగా ఆత్మకూరి శేషగిరిరావుని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, ఖమ్మం జిల్లా ఇంచార్జి గ్రంధి ప్రవీణ్‌కుమార్ నాయకత్వంలో ఇంచార్జి ప్రవీణ్‌కుమార్ నాయకత్వంలో నియమించారు. మీడియా రంగంలో అపార అనుభవాన్ని కలిగి ఉన్నారని వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్ సహకారంతో నియమించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ నన్ను నమ్మి తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ వైరా నియోజకవర్గ ఇంచార్జిగా నియమించి నందుకు ముందుగా వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అదేవిధంగా ఆర్య వైశ్య యువత నేడు అన్ని రంగాల్లోను ముందుందని, ముఖ్యంగా వాణిజ్య, వ్యాపార, పరిశ్రమ రంగాల్లో తమ సత్తా చాటుతుందని ప్రశంసించారు. దేశం ఎదుగుదల్లో ఆర్యవైశ్య పాత్ర చాలా కీలకమని వారు తెలిపారు. అదేవిధంగా ఆర్యవైశ్య ఎదుగుదలకు నా వంతు సహకారం ఉంటుందని వారు తెలియజేశారు. నా నియామకానికి కృషి చేసిన రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత అభిమాన సంఘానికి, ఆర్యవైశ్య నియోజకవర్గ మండల, పట్టణ ప్రముఖులకు కృతజ్ఞతలు తెలిపారు.

## డిసిఎం వ్యాన్ లభ్యం

**-లభించని డ్రైవర్ ఆచూకి**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** గత నాలుగు రోజుల క్రితం మండల పరిదిలోని అంజనాపురం సమీంలోగల నిమ్మవాగులో వరదలో డిసిఎం వ్యాన్ కొట్టుకు పోయిన విషయం విదితమే. నాలుగు రోజులుగా రెవిన్యూ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో వ్యాన్, డ్రయివర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు శుక్రవారం డిసిఎం వ్యాన్ లభించింది. క్రేన్ ల సహాయంతో వ్యాన్‌ను బయటకు తీశారు. డ్రయివర్ ఆచూకీ లభ్యం కాకపోవడంతో గాలింపు చర్యలు చేపట్టారు.

## ఇందిరా గాంధీ సేవలు మరవలేనివి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ దేశానికి చేసిన సేవలు మరవలేనివి అని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఇందిరా గాంధీ వర్ధంతి ని నిర్వహించారు. చిత్ర పటం కు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, భద్రయ్య, బాబురెడ్డి, జెర్రిపోతుల సత్యనారాయణ, పాకనాటి కన్నారెడ్డి, గరిడేపల్లి రామారావు, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు. రాయగూడెం గ్రామంలో బీసీ సెల్ జిల్లా ఉపాధ్యాక్షుడు బోయిన వేణు ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ విగ్రహం కు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నరేష్, గోపయ్య, బ్రహ్మం, రాజబాబు, లక్ష్మణావు, పానకాలు, చంద్రరావు, నాగయ్య తదితరుల పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** స్థానిక విద్యుత్ వినియోగదారులకు శనివారం సరఫరా కు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ కె. రామారావు పేర్కొన్నారు. మండల కేంద్రం లోని కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేలకొండపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి లోని ఫీడర్లలో చెట్టు కొమ్మలు కొట్టటం కొరకు విద్యుత్ సరఫరా ను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. నేలకొండపల్లి, కొత్తకొత్తూరు గ్రామాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ను నిలిపివేయనున్నట్లు తెలిపారు. కావునా విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

## ప్రజల్లో జాతీయ సమైక్యతాభావం పెంపొందించాలి

**- రన్‌ఫర్ యూనిటీలో సిపి సునిల్‌దత్**





**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ప్రజల్లో జాతీయ సమైక్యతా భావం, సామరస్యం, దేశభక్తిపై అవగాహన కల్పించడమే లక్ష్యమని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ అన్నారు. సర్దార్ వల్లభాయి పటేల్ 150వ జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో రన్‌ఫర్ యూనిటీ నిర్వహించారు. లకారం ట్యాంక్ బండ్ వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీని సిపి జెండా ఊపి ప్రారంభించారు. మమతారోడ్డు, ఇల్లెందు క్రాస్ రోడ్డు మీదుగా పటేల్ స్టేడియం వరకు ఈ పరుగు సాగింది. తొలుత పోలీసు అధికారులతో కలిసి రన్‌లో పాల్గొన్న అందరూ సమైఖ్యతా భావం చాటుతామని ప్రతిజ్ఞాచేశారు. ఈ సంర్భంగా సిపి మాట్లాడుతూ సర్దార్ పటేల్ సేవలు దేశానికి ఏకతాభావంతో కట్టిపడేశాయన్నారు. ఆయన న్యాయకత్వం ప్రతి భారతీయుడిని పేరేపితం చేసిందన్నారు. దేశప్రజలందరూ ఐక్యతాభావం, పటేల్ స్ఫూర్తితో ముందుకుసాగి దేశాభివృద్ధిలో భాగస్వాములం కావాలని పిలుపునిచ్చారు. ఈ పరుగులో అడిషనల్ డిసిపిలు ప్రసాద్‌రావు, భోజా రామానుజం, కుమారస్వామి, విజయబాబు, ఏసిపిలు రమణమూర్తి, సుశీల్‌సింగ్, నర్సయ్య, డాక్టర్ ప్రదీప్‌కుమార్, పోలీసు అధికారులు, నగర యువత, వాకర్స్ అసోషియేషన్ సభ్యులు, సినియర్ సిటిజన్‌లు, వివిద శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యలకు నిలయంగా ఏకలవ్యలు..!

**-విద్యార్థుల పరిస్థితి అయోమయం**



**ప్రజాపక్షం/ములకలపల్లి:** సమస్యలకు నియంగా ఏకలవ్యలు ఉన్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ స్థానిక ములకలపల్లి మండలం ముఖమామిడి గ్రామంలో గల ఈఎమ్ఆర్ఎస్ ఏకలవ్య మోడల్ పాఠశాలలో విద్యార్థులు సమస్యలతో సతమవమవుతూ గత మూడు రోజుల నుండి మంచి నీటి సౌకర్యం లేక అవస్థలు పడుతున్న పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు స్పందించకుండా విద్యార్థుల్ని అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం విద్యార్థులు తమ కాల కృత్యాలను వెళ్ళడానికి కూడా నీటి సౌకర్యం లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రతిష్టాత్మకంగా కొన్ని కోట్ల రూపాయలను వెచ్చించి విశాలాంతమైన ప్రాంతంలో నూతన బిల్డింగ్ నిర్మించిన కనీస వసతులు లేకుండా ఒక నిర్దిష్టమైన ప్రణాళిక లేకుండా ఏకలవ్య పాఠశాల నిర్మించి, విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్న పట్టించుకునే నాథుడే లేదని ఆరెపించారు. బాషా రాణి ఉపాధ్యాయులుగా నార్త్ ఇండియా నుండి నియమించి తెలంగాణ రాష్ట్ర బాషా సాంస్కృతి విధానాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిస్థితులు ఇక్కడ ప్రజల జీవన విధానాన్ని ఇక్కడ విద్యార్థుల యొక్క బాషా నైపుణ్యాన్ని తెలుసుకోకుండానే కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని, ఏకలవ్యాల్లో ఒక నిర్దిష్టమైన ప్రణాళికలను దానికి తగిన విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ములకలపల్లి మండలంలో గల ఏకలవ్య పాఠశాల ఉపాధ్యాయుల యొక్క తీరు చాలా ఇబ్బందికరమైన వాతావరణంగా చదువుని చెప్పాల్సినటెవంటి గురువులే గిరిజన విద్యార్థులని చిన్న చూపు చూస్తూ వాళ్ల తల్లిదండ్రులను సైతం అవమాన పరుస్తూ వ్యవహరిస్తున్నటువంటి ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని, ఏకలవ్యలో ఉన్నతాధికారి ఆర్‌సిఓ అరుణకు మారి స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని పోయి తెలంగాణ ఉన్నటువంటి 23 ఏకలవ్యాల్లో హిందీ ఇంగ్లీష్ భాషా నైపుణ్యం ఉన్న స్థానిక ఉపాధ్యాయుల్ని నియమించాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు మనోజ్, సన్నీ, బన్నీ, వికాస్, కళ్యాణ్, పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల కోసం పోరాడే సంఘం ఏఐటియుసి

**పూర్ణ స్వతంత్రం కావాలని మొదటిగా నినాదించిన సంఘం ఏఐటియుసి : యర్రా బాబు**





**ప్రజాపక్షం/వైరా:** భారతదేశంలో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా సంపూర్ణ స్వతంత్రం కావాలని మొట్టమొదటిసారిగా నినదించిన సంఘం కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడే సంఘం ఏఐటియుసి అని జిల్లా నాయకులు యర్రా బాబు అన్నారు. నేటికి ఏఐటియుసి పుట్టి 106 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా వైరా రింగు రోడ్డు సెంటర్ నందు ఏఐటియుసి పతాకావిష్కరణ ఏఐటియుసి మండల కార్యదర్శి జిల్లా నాయకులు గారపాటి అశోక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా సిపిఐ నాయకులు యర్రా బాబు ఆనాడు గనుల్లో ఖర్జానాల్లో కార్మికులకు 8గంటల పని దినాలు కావాలని పోరాడి సాధజంచుకున్న సంఘం అని అన్నారు. ఏఐటియుసి పోరాటాల ఫలితంగా భారతదేశంలో జరిగిన అనేక ప్రభుత్వం రంగ సంస్థలకు నెలకొల్పడం జరిగింది. నేడు అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ కార్మికుల హక్కుల కోసం ఉన్న చట్టాలను రద్దు చేస్తూ పాల్పడుతుందని విమర్శించిన భవిష్యత్తులో కార్మికుల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా భారత మాజీ పార్లమెంటు సభ్యులు ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ గురుదాస్ గుప్తా వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యామాల గోపాలరావు, ఏఐటియుసి నాయకులు మూట కొండ, తేల్లపుట్ట రాంబాబు, ఏర్పుల ఆంద్రం, ఇనపనూరి ముత్తయ్య, అక్కిశెట్టి రామకృష్ణ, పలువురు ఆటో కార్మికులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని ఇందిరమ్మ వర్ధంతి



**ప్రజాపక్షం/అశ్వాపురం:** దివంగత ప్రధాని, అఖిల భారత కాంగ్రెస్ నాయకురాలు ఇందిరా గాంధీ 41వ వర్ధంతి సందర్భంగా అశ్వాపురం మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ కార్యాలయం ఓరుగంటి వీరయ్య భవన్ నందు ఇందిరమ్మ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మండల నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా మండల అధ్యక్షులు ఓరుగంటి బిక్ష్మయ్య మాట్లాడుతూ ప్రధానిగా ఇందిరమ్మ సేవలు వెలకట్టలేనివన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన నేత ఇందిరమ్మ అన్నారు. ఉక్కు మహిళగా ప్రపంచ దేశాలలో కీర్తించిన ఘనత తనకే దక్కుతుందని తెలిపారు. భారత జాతి గర్వించదగిన పాలన చేసిందన్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, బచ్చు వెంకటరమణ, తోట సత్యనారాయణ, బరాజు సంపత్, గాదె ప్రతాప్‌రెడ్డి, గిద్దె నరసింహారావు, బూతం వెంకన్న, నేలపట్ల వీరారెడ్డి, భూక్యా కాళిదాసు, కోలా శశికాంత్, కుంజా జాను, తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక వర్గ పోరాటంలో ఎఐటియుసిది అజరామరమైన అధ్యాయం

**- కార్మికులు అనుభవించే ప్రతీ హక్కు ఎఐటియుసి పోరాట ఫలితమే..**

**- కార్మిక హక్కుల కోసం 106 ఏళ్ల పోరాటం**

**- చట్టాలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రంపై కార్మిక వర్గం తిరుగుబాటు చేయాలి : సాబీర్ పాషా**





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** భారతదేశ కార్మిక వర్గ పోరాట చరిత్రలో ఏఐటియూసిది అజరామరమైన అధ్యాయం అని, స్వాతంత్ర సమరంలోనూ, ఆ తర్వాత కార్మిక హక్కుల కోసం సాగిన ప్రతీ ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించిందని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఏఐటియూసి జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్‌కే సాబీర్ పాషా పేర్కొన్నారు. ఏఐటియూసీ 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంఘటిత, అసంఘటిత కార్మిక అడ్డాలు కార్మిక వాడల్లో జరిగిన ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఏఐటియూసి జిల్లా కార్యాలయం, మున్సిపల్, ఆటో, భవన నిర్మాణ కార్మిక అడ్డాల్లో జెండాలు ఎగురవేసి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన సభల్లో ఆయన మాట్లాడుతూ ఏఐటియూసి లక్ష్యం కేవలం జీతాల పెంపు మాత్రమే కాదని, కార్మికుల గౌరవం, సామాజిక భద్రత, సమానత్వం సాధించడమే అన్నారు. 106 ఏళ్ల సుదీర్ఘ పోరాట చరిత్రలో కార్మికులకు అనేక హక్కులు సాధించి పెట్టడంతో పాటు సాధించుకున్న హక్కుల పరిరక్షణకు పాటు పడుతున్నట్లు తెలిపారు. కార్మికులు అనుభవిస్తున్న ప్రతీ హక్కు వెనుక ఏఐటియూసి పోరాటం, త్యాగం ఉందన్నారు. కేంద్రంలోని మోడి ప్రభుత్వం కార్మికులు, ప్రజల కోసం కాకుండా కార్పోరేట్ శక్తులకు ఊడిగం చేస్తుందని, హక్కులు, చట్టాలు బడా కంపెనీలకు అనుకూలంగా మారుస్తు సవరిస్తూ శ్రామిక వర్గానికి తీరని అన్యాయం చేస్తోందని, ప్రైవేటీ కరణ పేరుతో ప్రభుత్వం రంగ సంస్థలను ధ్వంసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐటియూసి పుట్టిన రోజు కార్మిక వర్గం ఐఖ్యతకు ప్రతీక అన్నారు. రాబోయే రోజుల్లో కార్మిక వర్గాన్ని మరింత బలంగా తీర్చి దిద్దాలని ఐటియూసి శ్రేణులకు పిలుపునిచ్చారు. సంఘటిత శక్తితో పోరాడితే ఏ ప్రభుత్వమైనా తలవంచక తప్పదన్నారు . ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక దోరణిని ఎదుర్కొనేందుకు కార్మికులను చైతన్యం చేసే బాధ్యతను ఏఐటియూసి నిర్వర్తిస్తోందన్నారు ఈ కార్యక్రమంలో ఏఐటియూసి జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య, కార్యదర్శి గెద్దాడు నగేష్, నాయకులు దమ్మాలపాటి శేషయ్య, వంగా వెంకట్, జి వీరస్వామి, వి మల్లిఖార్జున రావు, జక్కుల గట్టయ్య, కే రాములు, కిష్టాపర్, సంధ్యబోయిన శ్రీను, యూమాయున్, నాగేశ్వర రావు, కృష్ణయ్య, మాచర్ల శ్రీనివాస్, కే నవీన్, లక్ష్మి , గుడిపాటి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కారేపల్లిలో ఘనంగా 106వ ఆవిర్భావ దినోత్సవం

**-ఏఐటియూసి జిల్లా కార్యనిర్వహణ అధ్యక్షులు రావి శివరామకృష్ణ**





**ప్రజాపక్షం/కారేపల్లి:** 106 సంవత్సరాల సుదీర్ఘ పోరాటాల చరిత్ర కలిగిన సంఘం ఏఐటీయూసీ అని ఏఐటియూసి జిల్లా కార్యనిర్వహణ అధ్యక్షులు రావి శివరామకృష్ణ అన్నారు. శుక్రవారం కారేపల్లి మండల కేంద్రం, క్రాస్ రోడ్, సీతారాంపురం, మాదారం డోలమైడ్ ప్రాంతాల్లో ఏఐటియూసి 106 ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కారేపల్లి క్రాస్ రోడ్‌లో ఆటోయూనియన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ దేశంలో అనాడు వెట్టిచాకిరి కి దోపిడీకి వ్యతిరేకంగా, దేశ స్వాతంత్రం కోసం ఆనాడు ఐక్యంగా బొంబాయి నగరం లో 1920 అక్టోబర్ 31 న ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) లాలా లజపతిరాయి, ఎంఎన్ జోషి నాయకత్వం లో మొదటి మహాసభ జరిగింది. అనాటి నుండి నేటి వరకూ ఏఐటీయూసీ నాయకత్వం లో అనేక పోరాటాలు ఉద్యమాలు నిర్వహించుకుని, కార్మికులకు పని గంటలకు, వేతన ఒప్పందం,రక్షణ,ఇన్స్యూరెన్స్, పీఎఫ్ గ్రాడ్యుయేట్, ప్రమాద బీమా పథకం, పెన్షన్ స్కీమ్ ఇలా అనేక కార్మిక చట్టాలను సాధించుకున్న చరిత్ర ఏఐటీయూసీ ది అన్నారు. సుదీర్ఘ పోరాటాల చరిత్ర కలిగిన సంఘం ఏఐటీయూసీ లో పనిచేయటం గర్వ కారణమన్నారు. ఎన్నో పోరాటాలు ఉద్యమాలు చేసి సాధించు కున్న 44 చట్టాలను కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం రద్దు చేసి, 4 చట్టాలను చేయాలని చూస్తుందని, దీనిని కార్మికులు ఐక్యము గా ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పాపినేని సత్యనారాయణ, జిల్లా సమితి సభ్యులు ఉంగరాల సుధాకర్, సిపిఐ సీనియర్ నాయకులు తాతా వెంకటేశ్వర్లు, మండల సహాయ కార్యదర్శి చెన్నం శెట్టి భూషయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పుచ్చకాయల శ్రీనివాసరావు, సిపిఐ నాయకులు వడ్డే వెంకటయ్య, బొమ్మల కృష్ణ, అమీర్ జానీ ఆటో యూనియన్ నాయకులు బట్టు శ్రీనివాస్, చిప్పలపల్లి సాగర్, చిలుముల వీరయ్య, జి రవి, కంసాని ఉపేందర్, ఎస్ కృష్ణమూర్తి, వై శ్రీను, రేఖ ప్రసాద్, సందీప్, బాలు, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నష్ట పరిహారం అందించాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** నీటి పాలైన రైతు కష్టం, ప్రభుత్వం వెంటనే స్పందించి నష్ట పరిహారం అందించాలని వైరా మాజీ శాసన సభ్యురాలు డాక్టర్ బానోత్ చంద్రవతి అన్నారు. శుక్రవారం సింగరేణి మండలంలోని సూర్యతండా గ్రామంలో ఆమె పర్యటించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా పంటలు పూర్తిగా నేలమట్టం కావడంతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆమె పరామర్శించారు. చేతి కొచ్చిన పంట కళ్లెదుటే నీటిపాలవ్వడంతో కన్నీరుమున్నీరవుతున్న రైతుల గోడును ఆమె స్వయంగా అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న వరి, పత్తి ఇతర పంట పొలాలను పరిశీలించి, రైతుల పరిస్థితిని చూసి చలించిపోయారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యం వల్ల రైతులు సర్వం కోల్పోయారని, వేల రూపాయలు పెట్టుబడి పెట్టి, కంటికి రెప్పలా కాపాడుకున్న పంట ఇలా నేలపాటు కావడంతో అన్నదాతలు తీవ్ర ఆవేదనలో ఉన్నారని తెలిపారు. వారిని చూస్తుంటే గుండె తరుక్కుపోతోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పంటలపై సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కేవలం ప్రకటనలకు హామీలకు పరిమితం కాకుండా నష్టపోయిన ప్రతి రైతుకు వెంటనే పంట నష్ట పరిహారం అందించి, వారిని ఆదుకోవాలని, రైతులు అధైర్యపడొద్దు, మీకు న్యాయం జరిగే వరకు మీ పక్షాన పోరాడతానని రైతులకు భరోసా ఇచ్చారు.

## ఇందిరా గాంధీ పేరు ఒక చరిత్ర గర్వం



**ప్రజాపక్షం/కారేపల్లి:** ఇందిరా గాంధీ పేరు ఒక చరిత్ర గర్వమని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర మహిళా నాయకురాలు పగడాల మంజుల అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో భారత తొలి మహిళ ప్రధాని, భారత రత్న, పేదల పక్షపాతి, బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి సంక్షోభాలను సవాళ్లుగా స్వీరించి గెలిచిన ఉక్కు మహిళ ఇందిర గాంధీ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతావనికి నిత్య చైతన్య స్ఫూర్తి పదం గరీభీ హటావో, రాజ భరణాల రద్దు, బ్యాంకుల జాతీయం, 20 సూత్రాల లాంటి విప్లవాత్మక నిర్ణయాలతో దేశ ప్రగతి కోసం పాటు పడిన మహానాయకురాలు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సింగరేణి మండల నాయకులు షేక్ మజీద్ పాషా, ఎండి హనీఫ్, పొలగని శ్రీనివాస్‌రావు, గోపాల్ నాయక్, ధారావత్ భద్రు నాయక్, షేక్ షఫీ, రాజ్ కుమార్, ధారవత్ రమేష్ నాయక్, షేక్ సద్దాం, షేక్ ఫిరోజ్, ఆదేర్ల రాములు పాల్గొన్నారు.

## మహా అన్నదాన కార్యక్రమం



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మండల పరిధిలోని మర్కోడు గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం వద్ద శుక్రవారం మహా అన్నదాన కార్యక్రమం క్రేజీ జోన్ మెన్స్ వేర్ క్లాత్ స్టోర్ యజమాని యాసరపు నిఖిల్ ఏర్పాటు చేశారు. మండలంలోని ఆళ్లపల్లి మర్కోడు తదితర ప్రాంతాల్లోని వందమంది అయ్యప్ప దీక్ష పరులకు మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో యాసరపు కృష్ణ, యాసారపు చంద్రం, గురు స్వాములు రణం మల్లికార్జున్, పొదిల రాము, తాళ్లపల్లి రమేష్, పానుగంటి వెంకటేశ్వర్లు, బుర్ర వెంకన్న, మండలోజు సదానందచారి, తదితర స్వాములు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా 2కే రన్



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం 06:30నిమిషాలకు చింతల గుంపు ఫారెస్ట్ ఆఫీస్ నుండి కస్తూరిబా విద్యాలయం ఆళ్లపల్లి వరకు ఆళ్లపల్లి ఎస్ఐ ముత్తినేనే సోమేశ్వర్ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. ఈ 2కే రన్‌లో ఆళ్లపల్లి మండల ప్రజలు, యువకులు, పాత్రికేయులు అధిక సంఖ్యలో పాల్గొని 2కే రన్‌ను విజయవంతం చేశారు. 2కే రన్‌లో పాల్గొన్న వారికి గుండెబోయిన రామకృష్ణ ఆధ్వర్యంలో ఫ్రూట్స్ ఫలహారాలు అందించారు. కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

## లంచాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ప్రభుత్వ అధికారులు చిన్న స్థాయి నుండి పై స్థాయి అధికారులు ఎవ్వరైనా ప్రజల సమస్యలు పరిష్కారం కొరకు డబ్బులు తీసుకొని లంచాలకు పాల్పడినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసి ములకలపల్లి మండల జేఏసీ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ లంచాలకు పాల్పడే వారిపై సెస్పెండ్ చెయ్యకుండా, పూర్తిగా ఉద్యోగం నుండి తొలగించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈకార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ రాష్ట్ర నాయకులు కొండ్రు సుందర్రావు, నర్సింహారావు, కొండ్రు రమేష్, మడకం చిరుమప్ప, సత్యనారాయణ, కొండ్రు నాగరాజు, కారం రాంబాబు, గడ్డం ఉదయ్‌కుమార్, సోడే సాయి, మీడియం నారాయణ, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## చెట్టును ఢీకొట్టిన కారు.. ఒకరు మృతి





**ప్రజాపక్షం/దమ్మపేట:** దమ్మపేట మండలం పట్వారి గూడెం నుంచి సత్తుపల్లి వెళ్లే రోడ్డు మార్గంలో కారు ప్రమాదవ శాత్తు అదుపు తప్పి బలంగా చెట్టును ఢీకొట్టింది. స్థానికుల సమాచారం ప్రకారం... కారులో ఉన్నవారు ముల్కలపల్లి మండలం జగన్నాథపురం గ్రామం నుంచి సత్తుపల్లి వెళ్తుండగా ప్రమాదం జరిగింది అని సమాచారం. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

# కార్మిక వర్గానికి దిక్సూచి ఏఐటీయుసి




**ఏఐటీయుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నరసింహారావు**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** భారతదేశంలో కార్మిక వర్గ రక్షణ, హక్కుల సాధన కోసం మొట్టమొదటి ఏర్పడిన కార్మిక సంఘం ఏఐటీయూసీ అని,కార్మిక వర్గానికి దిక్సూచిగా ఉంటూ, కార్మిక వర్గానికి అండగా కార్మిక చట్టాల రక్షణకు ఏఐటీయుసి పని చేస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు అన్నారు. బ్రాంచి కార్యదర్శి సముద్రాల సుధాకర్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన ఏఐటియూసి 106 వ వార్షికోత్సవం సందర్భంగా సత్తుపల్లి జేవిఆర్ఓసి లో ఏఐటీయూసీ జెండాను సింగూ నరసింహారావు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో నరసింహారావు మాట్లాడుతూ దేశంలో కార్మిక వర్గానికి అండగా ఉండేందుకు ఏఐటీయూసీ 1920 అక్టోబర్ 31న బొంబాయిలో ఏర్పడిందని, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాల కోసం, కార్మిక వర్గానికి కనీస సౌకర్యాల కల్పన కోసం, కార్మిక హక్కులు, హక్కుల రక్షణ కోసం అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించిన కార్మిక సంఘం ఏఐటియూసి అన్నారు. ఈ దేశంలో అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించి, కార్మిక వర్గాల రక్షణ కోసం అనేక మంది అమరవీరులయ్యారని వారి ఆశయ సాధన కోసం నేటి తరం పనిచేయవలసిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వర్గం మెడపై కత్తిని పెట్టి బిజెపి పాలన సాగిస్తుందని దీనికి వ్యతిరేకంగా రానున్న కాలంలో కార్మిక ఉద్యమాలను ఉధృతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ, ఏఐటియూసీ నాయకులు నిమ్మటూరి రామకృష్ణ, ఫిట్ కార్యదర్శి నరసింహారావు, సూర్య ప్రకాష్, సింగరేణి నాయకులు శ్రీకాంత్, మహేష్ ,మురళి, డేవిడ్, బాలసుబ్రమణ్యం, బన్వర్లాల్, బద్రి నాయక్ , రామ్మోహన్, శ్రావణ బాబు, జోసెఫ్, సామంత, ఆటో యూనియన్ నాయకులు కేశవరావు ,రమేష్, రఫీ ,ఫుట్పాత్ యూనియన్ నాయకులు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు జొన్నలగడ్డ రవి, వెంకటేశ్వరరావు, సత్తార్, హుస్సేన్ , రాంబాబు, రామకృష్ణ, ప్రసాద్ ,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లులు తక్షణం అమలు చేయండి

**-ఏవోకు మధ్యాహ్న భోజన పథకం వర్కర్ల వినతి**







**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనానికి సంబంధించి తక్షణం బిల్లులు చెల్లించాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పరిపాలన అధికారికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలోని 1140 ఏజెన్సీలలో 2090 మంది మధ్యాహ్న భోజన కార్మికులకు ఆరు నెలలుగా బిల్లులు పెండింగ్లో ఉన్నాయని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం అల్పాహారం బిల్లులను సైతం చెల్లించ లేదని ఆయన ఆరోపించారు. కార్మికులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు, మెనూ ఛార్జీలను తక్షణమే చెల్లించాలని లేని పక్షంలో రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాళ్లూరి లక్ష్మి , గుండెపొంగు మల్లేష్, యూనియన్ బాధ్యులు మహాదేవ లక్ష్మి , షేక్ రహీమున్నీసా, కృష్ణకుమారి, రామారావు, వెంకటమ్మ, జక్కంపూడి వెంకటలక్ష్మి , జగ్గాని వెంకటమ్మ, బండి నర్సమ్మ, సీత, సిహెచ్ సత్యవతి, రాజ్యలక్ష్మి , శ్రీలక్ష్మి , జరీనా, కృష్ణకుమారి, లక్ష్మి, లక్కీ, సరస్వతి పాల్గొన్నారు.

# దళారుల చేతిలో మోసపోవద్దు : ఎమ్మెల్యే జారే



**ప్రజాపక్షం/దమ్మపేట:** ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని, దళారుల చేతుల్లో మోసపోవద్దని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కోరారు. దమ్మపేట మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రం (ఖరీఫ్ 202526) ను శుక్రవారం ఎమ్మెల్యే జారే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వానికి ప్రాధాన్యం అని ప్రతి రైతు కష్టపడి పండించిన ప్రతి గింజకు ప్రభుత్వం తగిన మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తుందని తెలిపారు. సన్న రకం వరి ధాన్యానికి క్వింటాకు 500 బోనస్ అందజేస్తుందని తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన లేకుండా తమ పంటను సమీప ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా రైతులకు తగిన సదుపాయాలు కల్పించబడతాయని ధాన్యం తూకం చెల్లింపులు పారదర్శకంగా జరుగుతాయని పేర్కొన్నారు. దళారుల చేతిలో మోసపోవద్దని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, , కోయల అచ్యుతరావు, కాకిరాల రమేష్, కేవీ సత్యనారాయణ, చిన్నశెట్టి చిట్టు, పగడాల రాంబాబు, చిన్న శెట్టి యుగేందర్, మార్కెట్ కమిటీ సిబ్బంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఎజిఎంగా నరసింహారావుకు పదోన్నతి

**అభినందించిన ఏఐటియూసి, ఐఎన్టీయూసీ నాయకులు**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సింగరేణి కిష్టారం ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ నరసింహారావుకు అడిషనల్ జనరల్ మేనేజర్ పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా ఏఐటియూసి బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్, ఐఎన్టీయూసీ ఫిట్ సెక్రటరీ బాలాజీ, బ్రాంచ్ సెక్రటరీ తీగల క్రాంతి కుమార్ తదితరులు అడిషనల్ జనరల్ మేనేజర్ పదోన్నతి పొందిన నరసింహారావుకు పుష్పగుచ్ఛం అందజేసి ,శుభాకాంక్షలు తెలిపి,శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ సింగరేణి సంస్థ ప్రగతికి వెన్నెముక్కగా నిలిచే కార్మిక వర్గానికి మెరుగైన ప్రయోజనాలు కల్పిస్తూ నిర్దేశించిన, ఉత్పత్తి ఉత్పాదకత లక్ష్యాల సాధనలో స్ఫూర్తిదాయకమైన విజయాలతో మంచి పేరు ప్రఖ్యాతలు సాధించారని అభినందించారు. కిష్టారం ఓసి అధికారులు , ఉద్యోగుల సమన్వయంతో కిష్టారం ఓసి లక్ష్యం ఉత్పత్తి సాధనకు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. అదేవిధంగా సత్తుపల్లి సింగరేణి ప్రభావిత ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి పై అధికారులతో సంప్రదించి ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి కృషి చేసారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూసి నాయకులు, ఐఎన్టీయూసీ బ్రాంచ్ నాయకులు నాగ ప్రకాష్ , రామారావు ఫిట్ సెక్రెటరి తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం.. ప్రాణదానంతో సమానం : సిపి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం నేలకొండపల్లి లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం కు విశేష స్పందన లభించింది. ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్ శిబిరం ను ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 1500 మంది రక్తదానం చేశారు. కార్యక్రమం ను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ మాట్లాడారు. అవకాశం దొరికినప్పుడల్లా రక్తదానం చేయాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. రక్తదానం చేయాలంటే మీ ఆరోగ్యం మంచిగా ఉండాలని అన్నారు. తలసేమియా రోగులకు ప్రతీ 15 రోజులకొకసారి రక్తం అవసరం అవుతుందని అన్నారు. అత్యవసర పరిస్థితిలలో రక్తం అందుబాటులో లేకపోవటంతోఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. మీరు చేసిన రక్తదానం ఎందరో అభ్యాగులకు ఉపయోగపడుతుందన్నారు. రక్తదానం చేయటం ప్రాణదానం తో సమానమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రామానుజం, ఏసీపీ తిరుపతిరెడ్డి, రమణమూర్తి, మంత్రి క్యాంపు కార్యాలయం ఇంచార్జీ తుంబూరు దయాకర్ రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, నంబూరి రామారావు, గరిడేపల్లి రామారావు, జెర్రిపోతులసత్యనారాయణ, కడియాల నరేష్, గుండా బ్రహ్మం, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో రాందాస్‌నాయక్ డోర్ టు డోర్ ప్రచారం



**ప్రజాపక్షం/వైరా:** జూబ్లీహిల్స్ అసెంబ్లీ, గ్రేట్ హైదరాబాద్ మున్సిపాల్ కార్పొరేషన్ 99వ డివిజన్ సిద్ధార్థ నగర్‌లో డోర్ టు డోర్ ప్రచారాన్ని వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్ నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి అధిక మెజార్టీతో విజయం సాధిస్తాడని ఇక్కడ ప్రజలు వరకు ప్రేమ ఆప్యాయతలు కాంగ్రెస్ పార్టీపై కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం ప్రజా అభివృద్ధి రాష్ట్ర అభివృద్ధి ఎలా చేస్తుందో వాటన్నింటికి ఆకర్షితులై ప్రజాపాలనలో కాంగ్రెస్ పార్టీని ముందంజలో ఉంటుందని ప్రజలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థికి ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారని ఖచ్చితంగా ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థికి ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారని ఖచ్చితంగా ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి గెలుపు దుందుభి మ్రోగిస్తామని శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు ఏన్కూరు, సింగరేణి, కొణిజర్ల, జూలురుపాడు, వైరా నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని నవీన్‌యాదవ్ విజయాన్ని కాంక్షిస్తూ ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

# ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండల కాంగ్రెస్ కార్యాలయంలో భారత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 42వ వర్ధంతి వేడుకలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతికి స్వర్గీయ ఇందిరాగాంధీ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అభివృద్ధికి బాటలు వేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, మున్సిపాల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, వైరా నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు పమ్మి అశోక్, బొర్రా గోవిందరావు, శీలం చంద్రశేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సత్యం, ఆత్మ కమిటీ డైరెక్టర్ జాలాది రామకృష్ణ, వీరశెట్టి సీతారాములు, మిట్టపల్లి నాగి, పాలేటి నర్సింహారావు, టెలికాం డైరెక్టర్ మచ్చా రామారావు, తిరుపతి శ్రీను, బండారు తిరుపతిరావు, వుయ్యూరి నాగేశ్వరరావు, షేక్ జానీ, పమ్మి వెంకటేశ్వర్లు, ముత్యాల కోటి, మిట్టపల్లి సైదులు, పర్సా రవి, వన్నవరపు ఏడుకొండలు, పెద్దప్రోలు లక్ష్మయ్య, బలుసుపాటి నాగేశ్వరరావు, షరీఫ్, బాషా, శ్రీనివాసరావు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖ ఆద్వర్యంలో రన్ ఫర్ యూనిటీ



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా నేషనల్ యూనిటీ డే (జాతీయ ఐక్యత దినోత్సవం) ని పురస్కరించుకుని సత్తుపల్లి పోలీస్ శాఖ ఆద్వర్యంలో కల్లూరు ఏసిపి రఘు అధ్యక్షతన శుక్రవారం "రన్ ఫర్ యూనిటీ" కార్యక్రమాన్ని పట్టణంలోని జేవిఆర్ కళాశాల క్రీడా ప్రాంగణం నుండి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్తుపల్లి అదనపు 6వ జడ్జి ఎం. శ్రీనివాస్ హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ జేవియార్ డిగ్రీ కళాశాల నుండి సత్తుపల్లి రింగ్ సెంటర్ వరకు జరిగింది. ఈ సందర్భంగా ఏసిపి ఎన్.రఘు, జడ్జీ శ్రీనివాసరావులు విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో పెనుబల్లి సిఐ ముత్తులింగం, సత్తుపల్లి, వేంసూరు,పెనుబల్లి ఎస్ఐలు వరప్రసాద్, కవిత, వెంకటేష్, పోలీసు సిబ్బంది, ఎన్‌సీసీ విద్యార్థులు, కళాశాల, పాఠశాలల విద్యార్థులు, పట్టణ ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడేందుకు చేపల పెంపకం దోహదం

**- జల వనరులు నిత్యం సజీవంగా ఉండేలా అధికారుల పర్యవేక్షణ అవసరం**
**- సింగభూపాలె ం చెరువులో 74,100 చేప పిల్లలు విడుదల చేసిన కూనంనేని**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గ్రామీణ ప్రజల ఆర్థిక వ్యవస్థ బలపడేందుకు చేపల పెంపకం దోహద పడుతుందని, సొసైటీలుగా ఏర్పడి గ్రామీణ ప్రాంతాల్లో చేపల చెరువులను అభివృద్ధి చేసుకుని ఆర్థికంగా ఎదిగేందుకు ముందుకురావాలని కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు కోరారు. సుజాతనగర్ మండలంలో సింగభూ పాలెం చెరువులో మత్స్యశాఖ మంజూరు చేసిన 74,100 చేప పిల్లలను శుక్రవారం ఆయన చెరువులోకి విడుల చేశారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు జీవనాధారంగా నిలుస్తాయని, చేపల పెంపకం ద్వారా రైతులు, మత్స్యకారులు ఆర్థికంగా బలపడతారన్నారు. ప్రతీ చెరువును సజీవంగా ఉండేలా సంబంధిత శాఖల అధికారులు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలన్నారు. చేపల పెంపకం ద్వారా ఆర్థిక తోడ్పాటు మాత్రమే కాకుండా వాతావరణ సమతుల్యతకు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందన్నారు. స్థానిక మత్స్యకార సంఘాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. చెరువుల సంరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు . గ్రామీణ



ప్రాంతాల్లో సహకార సంఘాల ద్వారా చేపల పెంపకాన్ని విస్తరించాలని, ప్రభుత్వం అధికారులు చేపల ఆహారం విత్తనాల సరఫరాపై దృష్టి పెట్టాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో చెరువులను అభివృద్ధి చేసి స్థిరమైన ప్రగతి సాధించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయనున్నట్లు తెలిపారు. మత్స్యశాఖ జిల్లా అధికారి అహ్మద్ ఇంథియాజ్ ఖాన్, కార్పోరేషన్ కమీషనర్ సుజాత, తహశిల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపిడిఓ భారతి, వ్యవసాయాధికారిని నర్మద, పలుశాఖల అధికారులు, కిషన్, బి శ్రీనివాస్, రాయల నాగేశ్వరరావు రమాదేవి కాంగ్రెస్ నాయకులు నాగసీతారాములు, మండే హనుమంతరావు, సిపిఐ జిల్లా నాయకులు సలిగంటి శ్రీనివాస్, భూక్యాధస్రు, కొమారి హనుమంతరావు, జక్కుల రాములు, మత్స్య సొసైటీ నాయకులు బానోత్ సూర్య, పిట్టల శైలు, పొదిల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రిలో అరుదైన ఆపరేషన్

**-అభినందిస్తున్న మండల ప్రజలు**
**-పేదలకు అందుబాటులో వైద్య సేవలు**

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ ప్రాంతీయ వైద్యశాలలో వైద్య విధాన పరిషత్ జిల్లా సమన్వయ అధికారి రాజశేఖర్ గౌడ్ వైద్యులు రమేష్ అశోక్ లు కల్లూరు లోని శుక్రవారం ప్రాంతీయ వైద్యశాలలో ఒక పేద మహిళలకు అరుదైన ఆపరేషన్ చేసి ప్రాణాన్ని రక్షించారు. వివరాలు ఇలా ఉన్నాయి... తల్లాడ మండలం రంగం బంజర కు చెందిన సంఘసాని జానకమ్మ కు భర్త శేషయ్య ముగ్గురు పిల్లలున్నారు. అయితే గత సంవత్సరం నుంచి ఆమె కడుపు నొప్పితో గ్యాస్ ట్రబుల్ తో బాధపడుతుంది. చాలా ఆసుపత్రులు తిరిగినా తగ్గకపోవడం వలన కల్లూరు లోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలో వైద్యులు రమేష్ ను బంధువులు సహాయంతో సంప్రదించారు. స్కానింగ్‌లో లోపల ఐదు కేజీల కనితి ఉన్నట్లు తేలడంతో శుక్రవారం ఉదయం సమయంలో ఆపరేషన్ అనంతరం ఐదు కేజీలు కణితి బయటకు తీశారు. భర్త కూలి నాలి చేసుకుని రెక్కాడితే డొక్కాడని కుటుంబము నిరుపేద కుటుంబం కావడంతో వారు కన్నీరు పెడుతూ ఆసుపత్రి డాక్టర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పేద మహిళలకు ప్రాణాన్ని నిలిపిన వైద్యులకు ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతూ వారి కుటుంబంలో ఆనందం అంతా ఇంత కాదు అనంతరం మీడియాతో మాట్లాడుతూ వైద్యులు త్వరలో కల్లూరు లోని అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయని ప్రస్తుతానికి పలు రకాల ఆపరేషన్లు అందుబాటులోకి వచ్చాయని విధాన పరిషత్ జిల్లా సమన్వయ అధికారి రాజశేఖర్ గౌడ్ విలేకరుల సమావేశంలో తెలిపారు. పేద కుటుంబంలో అరుదైన ఆపరేషన్ చేసి ప్రాణాన్ని రక్షించిన వైద్యులు రమేష్, అశోక్ , రాజశేఖర్ గౌడ్ లకు మండల ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# సాయిస్ఫూర్తిలో జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని గంగారం గ్రామంలోని సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతిని పురస్కరించుకుని కళాశాలలో జాతీయ సేవా పథకం వారి ఆధ్వర్యంలో అన్నీ ఇంజనీరింగ్ బ్రాంచీలు, యంబీఏ, డిప్లొమా విద్యార్థినీ, విద్యార్థులతో జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి, కళాశాల ప్రిన్స్ పాల్ డా.వూటుకూరి.శేషారత్నకుమారిలుమాట్లాడుతూ స్వాతంత్ర్యం తర్వాత దేశాన్ని ఏకం చేయడంలో కీలక పాత్ర పోషించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని భారతదేశం ప్రతి సంవత్సరం అక్టోబర్ 31న జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని (రాష్ట్రీయ ఏక్తా దివస్) జరుపుకుంటుందన్నారు. 1947 తర్వాత 560కి పైగా రాచరిక రాష్ట్రాలను ఏకీకృత భారతదేశాన్ని ఏర్పాటు చేయడంలో సర్దార్ పటేల్ దార్శనికత, ప్రయత్నాలను గౌరవించేందుకు భారత ప్రభుత్వం 2014లో మొదటిసారిగా జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో హెటేరో ఇన్స్టిట్యూట్ అఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ డా. కొండా రవికుమార్ , కళాశాల వైస్ ప్రిన్సిపాల్, సియస్ఈ విభాగాధిపతి డాక్టర్ షేక్.యాకూబ్ ,జాతీయ సేవా పథకం ఆఫీసర్ బలుసుపాటి. సీతారాములు, అసిస్టెంట్ ప్రొఫెసర్, కళాశాల యంబీఏ విభాగాధిపతి డాక్టర్ డియస్ వి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మొంథా తుపాన్ కారణంగా నష్టపోయి రైతాంగాన్ని ప్రభత్వం ఆదుకోవాలని, కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారభించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకెస్) సత్తుపల్లి మండలకమిటి ఆధ్వర్యంలో శుక్రవారం మండల తహశీల్దార్ పున్నం సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు ఒగ్గు నాగిరెడ్డి, కార్యదర్శి బిరిల్లి లాజర్ మాట్లాడుతూ మొంత తుపాన్ కి ముందు తర్వాత భారీ వర్షాల కారణం గా మండలంలో వరి, పత్తి, మొక్కజొన్న తదితర రైతంగం తమ పంటలు తీవ్రంగా నష్టపోయారని, కనీసం ప్రభుత్వం ఇంతవరకు నష్టపరిహారం అంచనాలు వేయకుండా చోద్యం చూస్తుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.




ఈ కార్యక్రమంలో కోర్స్ వెంకటేష్ , బొజ్జ విశ్వనాథం, నడికుదురు భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఎఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవం

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని మున్సిపాలిటీ కార్యాలయం, ప్రభుత్వాసుపత్రి వద్ద ఏఐటియుసి ఆవిర్భావ దినోత్సవం ఘనంగా కార్మికులు జరుపుకున్నారు. మున్సిపాలిటీ కార్యాలయం వద్ద మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఊడల కృష్ణ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద వంశీలు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ఎఐటియుసి ఉపాధ్యక్షులు వేము రాంబాబు మాట్లాడుతూ ఏఐటీయూసీ దీక్షా దినంగా పోరాటాలకు పదును పెడుతూ దేశవ్యాప్తంగా కోటానుకోట్లు కార్మికులు దిమ్మల వద్ద తోరణాల ఆవిష్కరించి దిమ్మెల వద్ద జండాలను ఎగరవేశారని అన్నారు. దేశవ్యాప్తంగా కార్మికులు పోరాటాల ద్వారా సంపాదించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను మార్చేసి నాలుగు కోడ్ లుగా కార్పొరేట్లకు అనుకూలంగా మార్చేశారని అన్నారు. ఏఐటీయూసీ పోరాటాలు చేస్తూ కార్మికులకు అండగా నిలుస్తూ హక్కులు బాధ్యతలు, వేతనాలు పెంపుదల అనేక పోరాటాలు చేస్తూ కార్మికులకు అండగా ఉంటుందని ఉందని ఈ విధంగా పలు రంగాలలో పనిచేస్తున్న కార్మికులు ఏఐటీయూసీ జండా కింద పనిచేస్తున్నారని, ఆదరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు దామాల దయాకర్ రావు, వజీర్‌మియా, ప్రకాష్ , యశోద, మణి రాజు, చింత పంటి శ్రీనుతో పాటు ఆసుపత్రి కార్మికులు వంశీ, ప్రమోద్, సురేష్, మేరీ, మధ్యాహ్న భోజన కార్మికులు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




# పోలీస్ అమరుల జ్ఞాపకార్థం రక్తదాన శిబిరం

**ప్రజాపక్షం/ముదిగొండ:** యువత సేవా కార్యక్రమాలు అలవర్చుకోవాలని, ముదిగొండ యువకుల సేవా స్ఫూర్తి అభినందనీయమని సిఐ మురళి అన్నారు. మండలంలోని నేలకొండపల్లి మార్కెట్ యార్డులో పోలీసు అమరవీరుల వార్షికోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మురళి మాట్లాడుతూ రక్తదానం అన్ని దానలలో గొప్పదని అన్నారు. మనం ఇచ్చిన రక్తం ఒక ప్రాణానికి బలం ఇస్తే దానికంటే గొప్ప పని మరొకటి లేదని అన్నారు. మండలం నుండి ఎన్‌హెచ్ఆర్‌సి తరపున 50 మంది యువకులు ఉత్సహంగా రక్తదానం చేశారని అన్నారు. రక్తదానం చేసిన యువకులలో మానవత్వం, సేవాభావం ప్రతిబింబిస్తూ ప్రజల ప్రశంసలు అందుకోవడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ హరిత, ఏఎస్ఐ అబ్దుల్‌ఖలీల్, కానిస్టేబుల్‌లు, స్థానిక నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ఇందిరాగాంధీ వర్ధంతి

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు మాజీ ప్రధాని, భారతరత్న ఇందిరాగాంధీ 41వ వర్థంతి సందర్భంగా మండల అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వార్గల అభ్యున్నతి కోసం ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఇందిగాంధీ ఆశయాలను కొనసాగించి బడుగు, బలహీన వర్గాల కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధి మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, టిపిసిసి నాయకులు శీలం ప్రతాప్‌రెడ్డి, ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షులు శీలం శ్రీనివాసరెడ్డి, నాయకులు అనుమోలు వెంకటకృష్ణారావు, యరమల పూర్ణచంద్రారెడ్డి, పంబి సాంబశివరావు, మీడియా సెల్ అధ్యక్షులు తలపురెడ్డి నాగిరెడ్డి, మల్లెల లక్ష్మణరావు, కంచర్ల వెంకటనర్సయ్య, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# జమలాపురంలో యూబిఐ గ్రాహక్ సేవల కేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని జమలాపురం గ్రామంలో యూబిఐ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామీణ గ్రాహక్ సేవా కేంద్రం సేవలను శుక్రవారం బ్యాంక్ సిబ్బంది ప్రారంభించారు. ఈ సేవా కేంద్రం ద్వారా అన్ని బ్యాంకింగ్ సంబంధిత సేవలను ఉపయోగించుకోవచ్చునని బ్యాంక్ మేనేజర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఈ కస్టమర్ కేర్ సెంటర్‌కు బ్యాంకు సంబంధిత సేవలు అన్ని వర్తిస్తాయని ఈ కేంద్రం ద్వారా ఈ కేవైసితో బ్యాంక్‌ఖాతాను ఓపెన్ చేసుకోవచ్చునని, బ్యాంక్ కార్యకలాపాలు కొనసాగించవచ్చునని తెలిపారు. ఈ సేవలన్ని ఉచితంగా ఈబిసి పాయింట్ నుండి పొందవచ్చునని నిర్వాహకులు పెనుమాక వరలక్ష్మీ తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ వినోద్‌కుమార్, క్యాషియర్ రవి, ముకేష్, బాలు, సుహాస్, నవీన్, వాసు, పల్లవి, ఖాతాదారులు పాల్గొన్నారు.



# సుదీర్ఘ పోరాటాల చరిత్ర కలిగిన సంఘం ఎఐటియుసి



**-సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి**
**-ఘనంగా 106వ ఆవిర్భావ దినోత్సవం**

**ప్రజాపక్షం/మణుగూరు:** 106 సంవత్సరాల సుదీర్ఘ పోరాటాల చరిత్ర కలిగిన సంఘం ఏఐటీయూసీ అని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి అన్నారు. శుక్రవారం దేశ వ్యాప్తంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం ఏఐటీయూసీ మణుగూరు కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ అనుబంధ సంఘాలైన ఆటో యూనియన్ సురక్ష బస్టాండ్ అడ్డ, బొగ్గుముఠా, గుమస్తా సంఘం, ఆర్టీసి తదితర సంఘాల ఆధ్వర్యంలో ఏఐటీయూసీ జెండాలను ఎగురవేశారు. ముందుగా బొగ్గు ముఠా ఆఫీసు ఎదురుగా ఏఐటీయూసీ జెండా ను సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి ఎగురవేశారు. గుమస్తా సంఘం దగ్గర ఏఐటీయూసీ జెండాను ఏఐటీయూసీ మణుగూరు మండల కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు ఎగురవేశారు. ఆటో యూనియన్ సురక్ష బస్టాండ్ అడ్డ దగ్గర ఏఐటీయూసీ జెండాను ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు వీరాచారి ఎగుర వేశారు. ఆర్టిసి డిపో ముందు ఏఐటీయూసీ అధ్యక్షులు రాయల బిక్షం ఎగుర వేశారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ దేశంలో అనాడు వెట్టిచాకిరి కి దోపిడీకి వ్యతిరేకంగా, దేశ స్వాతంత్రం కోసం ఆనాడు ఐక్యంగా బొంబాయి నగరం లో 1920 అక్టోబర్ 31 న ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) లాలా లజపతిరాయి, ఎంఎన్ జోషి నాయకత్వం లో మొదటి మహాసభ జరిగింది. అనాటి నుండి నేటి వరకూ ఏఐటీయూసీ నాయకత్వం లో అనేక పోరాటాలు ఉద్యమాలు నిర్వహించుకుని, కార్మికులకు పని గంటలకు, వేతన ఒప్పందం,రక్షణ,ఇన్స్యూరెన్స్, పీఎఫ్ గ్రాడ్యుయేట్, ప్రమాద బీమా పథకం, పెన్షన్ స్కీమ్ ఇలా అనేక కార్మిక చట్టాలను సాధించుకున్న చరిత్ర ఏఐటీయూసీ ది అన్నారు. సుదీర్ఘ పోరాటాల చరిత్ర కలిగిన సంఘం ఏఐటీయూసీ లో పనిచేయటం గర్వకారణమన్నారు. డిసెంబర్26 తేదీన ఖమ్మం లో జరుగు బహిరంగ సభను జయప్రదం చేయగలరని కోరుచున్నామఅన్నారు. సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు ఉద్యమాలు చేసి సాధించుకున్న 44 చట్టాలను కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం రద్దు చేసి, 4 చట్టాలను చేయాలని చూస్తుందని, దీనిని కార్మికులు ఐక్యము గా ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి, సిపిఐ మణుగూరు మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, జిల్లా సమితి సభ్యులు సొందే కుటుంబరావు, ఏఐటీయూసీ మణుగూరు మండల కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, అధ్యక్షులు రాయల భిక్షం, కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, గౌరవ అధ్యక్షులు తోట రమేష్ లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బోసెట్టి సంపత్, అదెర్ల రాములు, గడ్డల పగిడయ, ఏఐటీయూసీ ఆటో యూనియన్ సురక్ష బస్టాండ్ అడ్డ అధ్యక్షులు ఎంఎన్. రాజు, గౌరవ అధ్యక్షులు వీర చారి, కార్యదర్శి పుల్లయ్య, బొగ్గు ముఠా నాయకులు శ్రీకాకుళం వీరమల్లు, పిట్టల శీను, చింతల దశరథం, గుమస్తా సంఘం అధ్యక్షుడు భీమరాజు కృష్ణ, ఉపాధ్యక్షులు, పిండిగ రఘువరన్, కోల్ ట్రాన్స్ పోర్ట్ నాయకులు ప్రసాద్, ఆటో యూనియన్ నాయకులు శంకర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# పటేల్ చూపిన మార్గంలో ముందుకు సాగాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ చూపిన మార్గంలో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అన్నారు. పటేల్ 150వ జయంతి సందర్భంగా జాతీయ ఐఖ్యతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసులు ఆధ్వర్యంలో కొత్తగూడెం రైల్వే స్టేషన్ నుండి పోస్టాఫీస్ సెంటర్ వరకు రన్ ఫర్ యూనిటీ కార్యక్రమంలో ఎస్పి రోహిత్ రాజ్‌తో పాటు పాల్గొన్నారు. అనంతరం ఎస్పితో కలిసి కలెక్టర్ మాట్లాడుతూ దేశ సమగ్రత, ఐఖ్యతను కాపాడటంలో ఉక్కు మనిషిగా పిలుచుకునే పటేల్ కృషి ప్రతీ ఒక్కరికీ ఆదర్శం అన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా భారతదేశంలో జరుగుతున్న కుట్రలను తిప్పి కొట్టడంలో ప్రజలంతా సమైఖ్యంగా పోరాడాలని పిలునిచ్చారు. భవిష్యత్‌లో దేశం తిరుగులేని శక్తిగా నిలవాలంటే యువత ఆలోచనలు, దేశానికి ఉపయోగపడేలా మలుచుకుని లక్ష్యాలను నిర్ధేషించుకోవాలని పిలుపునిచ్చారు. భారత దేశంలో సంస్థానాలను విలీనం చేసి దేశంలోని ప్రజలంతా ఐఖ్యతతో జీవించేలా వల్లభాయ్ చేసిన కృషికిగుర్తుగా ఆయన పుట్టిన రోజును జాతీయ ఐఖ్యత దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు నరేందర్, కమాండెంట్ వెంకటేశ్వరెడ్డి, రెహమాన్, మల్లయ్య స్వామి, అధికారులు పాల్గొన్నారు.

# వల్లభాయ్ పటేల్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి : కలెక్టర్




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను స్ఫూర్తిగా తీసుకుని దేశ సమగ్రత అభివృద్ధి దిశగా యువత ముందుకు సాగాలని జిల్లాకలెక్టర్ జితేష్ విపాటిల్ పిలుపునిచ్చారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ సర్ధార్ 150 ఐఖ్యతా పాదయాత్ర కార్యక్రమాలను వివరించారు. పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని కేంద్రయువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మై భారత్ సంస్థ సమన్వయంతో దేశవ్యాప్తంగా సర్ధార్ 150 ఐఖ్యతా మార్చ్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. దేశసమగ్రత, ప్రజా స్వామ్యవిలువలు, దేశ భక్తి భావాన్ని బలోపేతమే లక్ష్యంగా కార్యక్రమాలు రూపుదిద్దుకున్నాయన్నారు. విద్యార్థుల్లో ఈ స్ఫూర్తిని పెంచేందుకు వ్యాస రచన, వాద వివాదాలు, సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో పార్లమెంట్ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. 10 పాసైన గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు హైదరాబాద్‌లోని ఎన్ఎస్‌టి సంస్థ ద్వారా ఫర్నీచర్ తయారీ రంగంలో మూడు నెలల శిక్షణ పూర్తి చేసిన 8 మంది యువకులకు ప్రస్తుతం రూ.15వేల వేతనంతో ఆరు నెలల అప్రంటీస్ షిప్ పొందుతున్నారని చెప్పారు.యువత అవకాశాన్నిసద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ, కార్మిక హక్కుల పరిరక్షణ ఎఐటియుసి ధ్యేయం

**ప్రజాపక్షం/మణుగూరు:** ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ, కార్మికుల హక్కుల పరిరక్షణ ఏఐటియూసి ధ్యేయం అని బ్రాంచ్ కార్యదర్శి కామ్రేడ్ వై రాంగోపాల్ అన్నారు. శుక్రవారం మణుగూరు పివి కాలనీ కేఎల్ మహేంద్ర భవన్ వద్ద 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం ఆనాడు కార్మిక వర్గం అంతా ఏకమై 1920 అక్టోబర్ 31న బొంబాయి నగరంలో లాలా లజపతి రాయ్, ఎంఎన్ జోషి నాయకత్వంలో మొదటి ఏఐటీయూసీ మహాసభ జరిగిందని అన్నారు. దేశ స్వాతంత్రం, కార్మికుల హక్కుల కొరకు ఆనాటి నుండి నేటి వరకు అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించి దేశ కార్మిక వర్గానికి పని గంటల విధానం, వేతన ఒప్పందం, రక్షణ, ఇన్సూరెన్స్, ప్రాఫ్, గ్రాడ్యుటి, ప్రమాద బీమా పథకం, పెన్షన్ స్కీం ఇలా అనేక హక్కులు పోరాడి సాధించుకున్న చరిత్ర ఏఐటియుసిది అని అన్నారు. సుదీర్ఘ పోరాటాల చరిత్ర గల ఏఐటీయూసీలో పనిచేయడం గర్వకారణం అని అన్నారు. సింగరేణిలో ఏఐటియుసి ఆధ్వర్యంలో అనేక హక్కులు కార్మిక వర్గం పోరాడి సాధించుకుందన్నారు. సింగరేణిలో ఏఐటీయూసీ సాధించి పెట్టిన బోనస్ చట్టం దేశవ్యాప్తంగా కార్మికులకు అందరికీ వర్తించిందని అన్నారు. లాభాలలో వాటా దేశంలో ఏ ప్రభుత్వ రంగ సంస్థలో లేని హక్కును ఏఐటీయూసీ సాధించిందని అన్నారు. సింగరేణి సంస్థ రక్షణకు కార్మికుల హక్కుల ఏఐటీయూసీ ధ్యేయం అని అన్నారు. వైస్ ప్రెసిడెంట్ ఎంవి రాంనర్సయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఆఫీస్ బేరర్ లు ఆవుల నాగరాజు, ఆధర్ల సురేందర్, సెంట్రల్ కౌన్సిల్ నెంబర్ దాట్ల సందీప్, ఫిట్ సెక్రటరీలు శనిగరపుశనిగరపు కుమారస్వామి, సాయి ప్రకాష్ చారి, సీనియర్ కార్యకర్తలు మన్నెం యోహాన్, ఇమాముద్దీన్, ఆకులపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సర్ధార్ వల్లభాయిపటేల్ జయంతి



**ప్రజాపక్షం/ బోనకల్ :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ ,ఎన్ఎస్ఎస్ చైర్మన్ నిళిని అధ్యక్షతన సర్ధార్ వల్లభాయిపటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్ధార్ వల్లభాయిపటేల్ స్వాతంత్ర్య ఉద్యమంలో క్రియశీలకంగా పాల్గొన్నారని, భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత స్వాతంత్రంగా ఉన్న సంస్థాలను, నిజాం పరిపాలనను అంతమొందించి భారతదేశానికి విముక్తి కలిగించి ఒకే దేశాన్ని నిర్మించి దేశ సమైక్యతకు కారణమైన సర్ధార్ వల్లభాయి పటేల్ సేవలను కొనియాడారు. ప్రపంచంలోనే అతి పెద్ద విగ్రహం 182మీటర్ల ఎత్తులో నిర్మించడం జరిగిందని, ఆయన జీవితాన్ని యువతరం ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకులు ఎ.మోహన్‌రావు, అధ్యాపకులు జోనాతాన్‌బాబు, రాజేంద్రకుమార్, పద్మావతి, రామకృష్ణ, రమేష్, జస్వంవ, బుజమ్మ, అరుణ విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# హరీష్‌రావుని పరామర్శించిన సండ్ర



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, తండ్రి తన్నీరు సత్యనారాయణ రావు ఇటీవల స్వర్గస్థులవ్వగా, శుక్రవారం తన్నీరు హరీష్ రావు నివాసానికి సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య చేరుకొని కీ.శే. తన్నీరు సత్యనారాయణ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించి, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడుని ప్రార్థించి, హరీష్ రావుని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సండ్ర వెంట పోట్రు ప్రవీణ్, దుగ్గిదేవర యుధిష్టర్, అవినాష్ తదితరులున్నారు

# దెబ్బతిన్న పంటల పరిశీలన



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మొంథా తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, మిర్చి పత్తి పంటలను సిపిఎం సత్తుపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం పరిశీలించారు. తుఫాను ప్రభావంతో రైతులు పూర్తిగా నష్టపోయారని రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సత్తుపల్లి పట్టణ మండల పరిధిలోని వరి, పత్తి, మిరప, వరి పంటలను క్షేత్రస్థాయిలో సిపిఎం పార్టీ బృందం పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రావుల రాజబాబు, సిపిఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కోలికపోవు సర్వేశ్వరరావు, పార్టీ నాయకులు, శీలం సత్యనారాయణ రెడ్డి, రావుల రాజబాబు, కొలిక పోగు సర్వేశ్వరరావు, భాస్కర్, రాము, వెంకటేష్ రావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహాపడి పూజ





**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణ శివారులో కొలువైయున్న శ్రీ హరిహరాత్మజ అయ్యప్ప స్వామి ఆలయ 10వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం రాత్రి టిజిఐడిసి చైర్మన్ మువ్వా విజయ్ బాబు, దంపతులు ఆధ్వర్యంలో నిర్వహించిన మహా పడిపూజ అంగరంగ వైభవంగా జరిగింది. మహా పడిపూజ కార్యక్రమాని కేరళ మంత్రి బ్రహ్మశ్రీ మధుసూదనా నంబూద్రి, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ వెంకట సురేష్ ఆచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, శ్రీ గణపతి పూజ, శ్రీ షిరిడి సాయి బాబా సేవ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అయ్యప్ప మాల ధార భక్తులకు మద్యాహ్న బిక్షను వితరణ చేశారు. సాయంత్రం శ్రీ ద్రోణం రాజు మల్లిఖార్జున శర్మ గురు స్వామి, శిష్యబృందం, శ్రీ డోలక్ సుబ్బారావు స్వామి, శిష్య బృందం చే సంకీర్తనలతో ఆలయ ప్రాంగణం అంతా అయ్యప్ప స్వామి కీర్తనలతో పట్టణ శివార్లు దద్దరిల్లాయి. ప్రత్యేక ఆకర్షణగా కేరళ వారి జెండా వాయిద్యం నిలిచింది. మహా పడిపూజ అనంతరం స్వాములకు భక్తులకు అల్పాహారాన్ని అందించారు. చైర్మన్ మువ్వా విజయబాబు ప్రతి సంవత్సరం అయ్యప్ప మాల ధరించి నియమ నిష్టలతో దీక్షననుసరించ దంపతులుగా స్వామి వారి మహా పడిపూజను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. విజయ బాబు స్వామి పడిపూజకు జిల్లా, రాష్ట్ర సరిహద్దుల నుండి అయ్యప్ప స్వాములు, భక్తులు భారీగా హాజరవుతారు. ఈ మహా పడిపూజ కార్యక్రమంలో అధ్యక్షులు దోసపాటి అమరలింగేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి బొంతు శ్రీనివాసరావు, కోశాధికారి గుండు ఉమామహేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు, వందలాదిమంది అయ్యప్ప, భవాని మాలధార భక్తులు, స్థానిక ప్రజలు తదితరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.